క్లుప్తంగా

వేంకటేశుని సన్నిధి.. భక్తుల పెన్నిధి



విశేష అలంకరణలో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి

పెరవలి: ఏకాదశి, శనివారం కావడంతో అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో దర్శనానికి గంట సమయం పట్టింది. వందలాది మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. దాతల ఆర్థిక సహాయంతో 4 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు అన్నసమారాధన, ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆలయంలో కొత్తగా స్వామి వారికి పుష్పాలంకరణ, భక్తులకు ప్రసాదం, నిత్య గోత్రార్చన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైభవంగా గణనాథుని ఊరేగింపు

దేవరపల్లి: స్థానిక మెరక వీధి వినాయకుని ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణనాథుని ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు అర్ధరాత్రి వరకూ జరిగింది. అనంతరం గ్రామంలోని జలాశయంలో నిమజ్జనం చేశారు. బుట్టబొమ్మల నృత్యప్రదర్శన, గొర్రెగేదెల ప్రదర్శనతో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేక రథంపై గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేయడానికి స్థానిక పంచాయతీ వార్డు సభ్యుడు, న్యాయవాది కై రం అప్పారావునాయుడు రూ.1.65 లక్షలకు విగ్రహాన్ని వేలం పాటలో పాడుకున్నారు. ఊరేగింపు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఘనంగా అన్నసమారాధనలు

నిడదవోలు రూరల్: గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని సమిశ్రగూడెం గరువు సెంటర్‌లో శనివారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోతవరం పీహెచ్‌సీని పరిశీలించిన డీఐఓ

నల్లజర్ల: జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) రాజేశ్వరి శనివారం సాయంత్రం మండలంలోని పోతవరం పీహెచ్‌సీని సందర్శించారు. తొలుత ఫీల్డ్ విజిట్ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో కొత్తగా ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ భద్రపరిచే ఐఎల్ఆర్, డీప్ ఫ్రీజర్‌లను, వ్యాక్సిన్ స్టాకును ఆమె పరిశీలించారు. ఎంఎల్‌హెచ్ పీలకు, సూపర్‌వైజర్లకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీలో ఎవరు సెలవు పెట్టినా ఇమ్యూనైజేషన్ కార్యక్రమం ఆగకూడదన్నారు. సూపర్‌వైజర్లు జయప్రకాశ్ మీరాబాయి, ఫార్మాసిస్ట్ వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ సత్యం ఆమె వెంట ఉన్నారు.

గోదావరి ఒడ్డునే మృతదేహం లభ్యం

కొవ్వూరు: పట్టణం నుంచి ఆరికిరేవుల వెళ్లే రోడ్డు మార్గంలో గామన్ ఇండియా హైవే బ్రిడ్జికి దిగువన గోదావరి ఒడ్డునే సుమారు 60 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతదేహాన్ని పట్టణ పోలీసులు శనివారం గుర్తించారు. అతడి పేరు హనుమంతు అని, ఆరికిరేవుల, చిడిపి గ్రామా ల్లో పొలం పనులు చేసుకునే వాడని పట్టణ పోలీసులు చెబుతున్నారు. మృతుడి వద్ద లభ్యమైన ఫోన్ ఆధారంగా విచారణ జరుపుతున్నారు. మృతుడు చిడిపి గ్రామానికి చెందిన కట్టా శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద వ్యవసాయ పనులు చేసినట్టు ఏఎస్సై జీజీ ప్రకాశ్ తెలిపారు. మూడు రోజుల క్రితమే ఇంటికి వెళతానని చెప్పి వెళ్లినట్టు తెలిసిందన్నారు. మృతదేహం తలభాగం పూర్తిగా పాడై గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. హనుమంతు మూడు రోజు క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై ప్రకాశ్ తెలిపారు.

స్నానఘట్టంలో ..

కొవ్వూరు: పట్టణంలోని భక్తాంజనేయ స్వామి గోదావరి స్నానఘట్టంలో ఓ వృద్ధుడి మృతదేహాన్ని శనివారం స్థానికులు కనుగొన్నారు. మృతుడిని ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండలం దిప్పకాయపాడుకు చెందిన పోలుమాను వెంకట్రావు (62)గా గుర్తించారు. అనారోగ్యంతో ఉన్న వెంకట్రావు రాజమహేంద్రవరం ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తూ గోదావరి స్నానం చేసేందుకు కొవ్వూరులో దిగారు. నదిలో స్నానానికి దిగి నీట మునిగి చనిపోయి ఉండవచ్చని మృతుడి కుమారుడు రాంబాబు పేర్కొన్నాడు. అతడిచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై కె.జగన్మోహన్‌రావు కేసు నమోదు చేశారు. వెంకట్రావు శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయలు దేరాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో వెతుకులాడుతుండగా స్నానఘట్టంలో మృతదేహం లభ్యమైనట్టు పేర్కొన్నారు.

ధాన్యం సేకరణ లక్ష్యం 4.42 లక్షల మెట్రిక్ టన్నులు

- జాయింట్ కలెక్టర్ చినరాముడు
- సేకరణ, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అధికారులతో సమీక్ష



రైస్‌మిల్లర్లు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చినరాముడు

తాళ్లపూడి: జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 4.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జాయింట్ కలెక్టర్ చినరాముడు వెల్లడించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులు, రైస్‌మిల్లర్లు, రైతులతో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం విక్రయాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. వివిధ మండలాల్లోని రైతుల సమస్యలతో పాటు రైస్ మిల్లర్ల ఇబ్బందులను కూడా తెలుసుకుంటున్నట్టు తెలిపారు. గోనె సంచులు, వేయింగ్ మెషీన్లు తదితర ఇబ్బందులపై చర్చిస్తున్నట్టు చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ ఈ సీజన్‌లో జిల్లాలోని 18 మండలాల్లో 70,600 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నామన్నారు. అనంతరం జేసీ చినరాముడు తాడిపూడి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్‌వో భాస్కర్, సివిల్ సప్‌లై డీఎం టి. రాధిక, కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, ఏవో జి.రుచిత సీఎస్ డీటీ దివాకర్, రైస్ మిలర్ల సంఘం అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు, మండల శాఖ అధ్యక్షుడు గోకవరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవలో వన మహోత్సవాలు



కొవ్వూరు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో మొక్క నాటుతున్న డిపో మేనేజర్ కుమార్



అనంతపల్లి హైస్కూల్ ఆవరణలో మొక్క నాటుతున్న ఉద్యాన శాఖాధికారి బబిత

కొవ్వూరు: స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో మొక్కలు నాటే కార్యక్రమాని డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ ప్రారంభించారు. డిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు టీవీ రాజు, నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) ప్రతినిధి ఎ.రాజు, ట్రాఫిక్ సూపర్‌వైజర్ కేవీ కుమారి, ఏడీసీ వీసీహెచ్ఎస్ రావులతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. రెండు రోజులుగా గ్యారేజీ, డిపో పరిసరాలను శుభ్రం చేశామని డిపో మేనేజర్ తెలిపారు.

అనంతపల్లి హైస్కూల్లో..

నల్లజర్ల: పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నట్టు ఉద్యాన శాఖాధికారి బబిత తెలిపారు. అనంతపల్లి, నబీపేట పంచాయతీలకు ప్రత్యేకాధికారి అయిన బబిత స్వచ్ఛతా హి సేవలో భాగంగా శనివారం అనంతపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ, ప్రైవేట్ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. విద్యుత్, తాగునీటి ఆదా, ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలనపై పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో బబిత నీడనిచ్చే మొక్కలు నాటారు. సర్పంచ్ వెంగల కమలకుమారి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ఉండ్రాజవరం: బాలింతలు బలమైన ఆహారం తీసుకోవాలని సీడీపీవో శ్రీలక్ష్మి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని తాడిపర్రు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆకుకూరలు, చిరుధాన్యాలు, కాయగూరలు ఆహారంగా తీసుకోవాలని బాలింతలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బాలింతలు అదనపు పోషకాహారంగా రోజూ గుడ్లు, మునగాకు, కొత్తిమీర వంటివి వాడాలన్నారు. బాలామృతం పిల్లలకు అందజేయాలన్నారు. భోజనాలకు ముందు తరువాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ కె.నరేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం శివపార్వతి, ప్రశాంతి, అంగన్వాడీ కార్యకర్తలు గిరిజ, రాణి, కృప, అనంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దూబచర్లలో శాంతి దినోత్సవం



దూబచర్లలో విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు

నల్లజర్ల: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు 42 ఏళ్లుగా అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని ఏటా సెప్టెంబరు 21న నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి నెలకొనాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షించాలన్నారు. అనంతరం విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాసరావు, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వీరభద్రరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో శాంతిని కాపాడండి

కొవ్వూరు: విద్యార్థులందరూ ఐకమత్యంతో ఉంటూ ప్రపంచ శాంతిని కాపాడడంలో భాగస్వాములు కావాలని లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ అధ్యక్షుడు మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ సూచించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూలు శనివారం ప్రపంచ శాంతి దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు ఎండీ హుస్సేన్, సభ్యుడు కలగర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

- బోర్డు రీజినల్ మేనేజర్ ప్రసాద్
- కొనుగోళ్లు ముగిసిన సందర్భంగా సన్మానం



గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో ఆర్ఎం, ఏఎస్‌లను సత్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

గోపాలపురం: అనుమతికి మించి పొగాకును పండించే రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ జీఎలీకే ప్రసాద్ హెచ్చరించారు. గోపాలపురం వేలం కేంద్రం వద్ద పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్ఎం ప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పొగాకు ఉత్పత్తి ఉండాలన్నారు. ఈఏడాది మార్కెట్‌ను ఆసరాగా తీసుకొని పొగాకు సాగు విస్తీర్ణాన్ని పెంచవద్దని రైతులకు సూచించారు. పొగాకు వేలం కేంద్రం అధికారి ఏఎస్ అమూల్ శ్యామ్ మాట్లాడుతూ వర్జీనియా పొగాకు డిమాండ్‌ను బట్టి ఉత్పత్తి చేస్తేనే గిట్టుబాటు ధరలు పొందగలరన్నారు. అనంతరం ఆర్ఎం ప్రసాద్, ఏఎస్ అమూల్ శ్యామ్‌లను రైతు సంఘం నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు ఇల్లూరి రాంబాబు, రైతు నాయకులు పిన్నమనేని మధుమోహన్, గద్దే శేషగిరిరావు, దుగ్గిరాల రాంబాబు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, నందమూరి సత్యనారాయణ, కూసం రామమోహన్ రెడ్డి పొగాకు వేలం కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పల్లంట్లలో ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



తాళ్లపూడి మండలం మలకపల్లిలో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల ప్రారంభోత్సవ దృశ్యం



పల్లంట్ల ఫుట్‌బాల్ పోటీలో తలపడుతున్న బాలికలు

దేవరపల్లి: ఆటపాటలతో కూడిన చదువును ముందుకు తీసుకు వెళదామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్- 14, అండర్-17 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలను శనివారం పల్లంట్ల జెడ్పీ హైస్కూల్లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. కార్యక్రమానికి సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కొయ్యలమూడి సుధారాణి, ఎస్ఎంపీ చైర్మన్ గంగారత్నం, టీడీపీ మండల అధ్యక్షులు ఆండ్రు అనీల్, మాజీ అధ్యక్షులు కొయ్యలమూడి చినబాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు, తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ పి. ప్రభాకరరావు, పీడీ రామకృష్ణంరాజు, 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

మలకపల్లిలో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

తాళ్లపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బాలికలకు శనివారం మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. రెండో విడత అండర్- 14, అండర్-17 బాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. మండలంలోని ఎనిమిది పాఠశాలల నుంచి 400 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మలకపల్లి సర్పంచ్ రాపాక రాజేశ్వరి, హెచ్ఎం శ్రీవాసవి, ఉపసర్పంచ్ ఎం. రామారావు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ నాగరాజు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన తోట రామకృష్ణ



మాజీ సీఎం జగన్‌తో మాట్లాడుతున్న తోట రామకృష్ణ

తాళ్లపూడి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తాము ఎప్పటికీ వైఎస్సార్ సీపీ బలోపేతానికి పాటు పడతామని చేస్తామని రామకృష్ణ తెలిపారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, యువ నాయకుడు ముద్రగడ గిరిబాబు తదితరులు జగన్‌కు కలిసిన వారిలో ఉన్నారు.

ఎమ్మార్పీకి మించి సరకులు విక్రయిస్తే కేసులు

తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ హెచ్చరిక



చాగల్లులో కాటాలను పరిశీలిస్తున్న కొవ్వూరు డివిజన్ తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్

చాగల్లు: గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ) కంటే ఎక్కువకు సరకులు విక్రయించే దుకాణదారులపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని కొవ్వూరు డివిజన్ తూనికలు,కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని రేషన్ షాపుల్లో వినియోగించే కాటాలను చాగల్లు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ ఎమ్మార్పీ లేకుండా సరుకులు విక్రయించిన వారిపైన, సీల్ లేని కాటాలు ఉపయోగించిన వ్యాపారులపై 81 కేసులు నమోదు చేశామన్నారు. దుకాణాల్లోని కాటాలకు సీలు వేయించుకోకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ముద్ర రుసుములో భాగంగా రూ.2.15 లక్షలు, తూనికలు, కొలతల్లో అవకతవకలకు పాల్పడిన వారి నుంచి రూ.4.02 లక్షలు జరిమానాగా వసూలు చేశామని తెలిపారు. అధిక ధరలకు వంటనూనె విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో నిడదవోలులోని ఓ షాపులో తనిఖీలు నిర్వహించి ఒక కేసు నమోదు చేశామని తెలిపారు.

ఘనంగా గురజాడ జయంతి

నిడదవోలు: గురజాడ అప్పారావు గొప్ప దార్శనికుడని స్థానిక ఎస్‌వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధ్యక్షురాలు పి.ఉషారాణి అన్నారు. ఆ కళాశాలలో శనివారం అభ్యుదయ కవితా పితామహుడు, మహాకవి గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్ర పటానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కంబయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అధ్యాపకులు కె.జానకీదేవి, శ్రీలక్ష్మి భ్రమరాంబ, జె.శోభారాణి, సోనీ, లావణ్య, సరోజని, శ్రీదేవి పాల్గొన్నారు.